క్లుప్తంగా

ఒగ్గు కళాకారులకు సన్మానం



భూపాలపల్లి రూరల్: సీనియర్ ఒగ్గు కళాకారులు కంచు ఐల్లయ్య, కావటి మల్లయ్య, కొమురయ్యలను మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఒగ్గు కళాకారుల సంఘం జిల్లా గౌరవ సలహాదారులు కంబాల రాజయ్య సన్మానించారు. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి జిల్లా ఒగ్గు సంఘం అధ్యక్షుడు కుంట సదన్న, భూపాలపల్లి జిల్లా కోశాధికారి కంచు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సమావేశం

మహాముత్తారం: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో చైర్మన్ సోమ శాంత కుమార్ ఆధ్వర్యంలో నేడు ఎంసీ సమావేశం నిర్వహించడం జరుగుతుందని సీఈఓ మార్క శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి మండలంలోని పలు గ్రామాలకు చెందిన సింగిల్‌విండో డైరెక్టర్లు సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఆర్థిక సాయం



టేకుమట్ల(రేగొండ): రేగొండ మండల కేంద్రానికి చెందిన గుంటోజు స్వరాజ్యం అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకుడు మోడెం ఉమేష్‌గౌడ్ పరామర్శించి, రూ.2000 ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట ఎంపీటీసీ మైన భిక్షపతి, టౌన్ అధ్యక్షుడు కొలెపాక భిక్షపతి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సామల పాపిరెడ్డి, బీఆర్ఎస్ మండల నాయకులు చంద్రశేఖర్, రామచందర్, అక్బర్‌బాషా, తాజుద్దిన్, తడుక శ్రీకాంత్, నరేష్, రాంరెడ్డి, తదితరులు ఉన్నారు.

రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలి



మహదేవపూర్: మహదేవపూర్‌లో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని తహసీల్దార్‌కు పాత్రికేయులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో లచ్చయ్య, నజీర్, షఫీ, రామరావు, శ్రీనివాస్, మజీద్, ముబీన్, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



అనిల్ (ఫైల్)

కాటారం: భార్య కాపురానికి రావడం లేదని తీవ్ర మనస్థాపానికి గురైన యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కాటారం మండలంలో మంగళవారం చోటు చేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మల్హర్ మండలం ఇప్పలపల్లికి చెందిన దుంద్ర అనిల్(26) ఏడాది క్రితం అదే గ్రామానికి చెందిన కోమలతను ప్రేమ వివాహం చేసుకొన్నాడు. ఈ వివాహం కోమలత తల్లిదండ్రులకు ఇష్టం లేదు. ఆరు నెలల క్రితం కోమలత పుట్టింటికీ వెళ్లి తిరిగి రాలేదు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు పలుమార్లు పంచాయితీలు జరిగినప్పటికీ ఫలితం లేదు. తన భార్య ఇక కాపురానికి రాదేమో అని తీవ్ర మనోవేధనకు గురైన అనిల్ కాటారం మండలం గోపాలపూర్ వద్ద అతడు సాగు చేస్తున్న పత్తి చేను వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొన్నాడు. మృతుడి తండ్రి ఓదేలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అభినవ్ తెలిపారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

వెంకటాపురం(కె): గుడుంబా తయారీ, రవాణా లాంటి అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని వెంకటాపురం సీఐ బండారి కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బెస్తగూడెం గ్రామంలో గుడంబా స్థావరాలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఏడు వేల లీటర్ల బెల్లం పానకం, 50 లీటర్ల గుడుంబా, వంద కేజీల పటిక, 50 కేజీల పంచదారను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నలుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

మల్హర్: మండల కేంద్రం తాడిచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగాం అధికారి, తెలుగు ఉపన్యాసకులు రవీందర్ మాట్లాడారు. సామాన్యులకు పూర్తిగా అర్థం కాని గ్రాంథిక భాషా స్థానంలో వ్యవహారిక (వాడక)భాషా ఉద్యమంలో పాల్గొని ఆనాటి పాలక అధికారులు వ్యతిరేకించిన కానీ పట్టు వదలని విక్రమార్కుడిలా ఉద్యమం చేసి వ్యవహారిక భాషాను ప్రవేశ పెట్టడంలో సఫలీకృతుడు అయినటివంటి గిడుగు రామ్మూర్తి గురించి విద్యార్థులకు ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్స్‌పాల్ ప్రవీణ్, అధ్యాపకులు నరేందర్, వెంకట్‌రెడ్డి, కరుణాకర్, నరేష్, రమేష్, భరత్, జయపాల్, ఉమామహేశ్వరి, సీనియర్ అసిస్టెంట్ రాములు, సాబార్డినేట్ షబీర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

రేగొండ మండలం రామన్నగూడెంతండాలో..

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని రామన్నగూడెంతండా ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కామిడి సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవహారిక భాషా కోవిదుడు గిడుగు రామ్మూర్తి జయంతీ వేడుకలను నిర్వహించి మాట్లాడారు. అన్ని భాషల్లోకెల్లా తెలుగు భాషా తియ్యనిదని అన్నారు. తెలుగు భాషలో ఉన్న గొప్పదనం మరే భాషలో లేదని అన్నారు. విద్యార్థులకు పద్య పఠనం, దేశభక్తి గీతాలు, సూక్తులపై పోటీలు నిర్వహించి బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుసుమ వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ టీచర్ సరస్వతి, విద్యార్థులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కాటారంలో..

కాటారం: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలలో పాటు మేడిపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి మేజర్ ధ్యాన్‌చంద్, గిడుగు వెంకటరామమూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేశారు. కేజీబీవీలో విద్యార్థినులు టమోటాలతో తెలుగుభాషా దినోత్సం అనే ఆకృతిని రూపొందించారు. క్రీడల వల్ల ప్రయోజనాలను అచ్చ తెలుగులో విద్యార్థులతో వర్ణింపజేశారు. మేడిపల్లి గిరిజన బాలికల పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులు వీరన్న, రమాదేవిలను ప్రధానోపాధ్యాయుడు, విద్యార్థులు సన్మానించారు. తెలుగు భాషా గొప్పదనం, క్రీడల వల్ల కలిగే ప్రయోజనాలను గూర్చి ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమాల్లో కేజీబీవీ ప్రిన్సిపాల్ చల్ల సునీత, మేడిపల్లి పాఠశాల ప్రిన్సిపాల్ రవిశంకర్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కాటారం: తెలుగు భాషా దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు



రేగొండ మండలం రామన్నగూడెంతండాలో..



మల్హర్‌లో..

సమస్యల పరిష్కారానికి కృషి

కాటారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నెలకొన్న సమస్యలను మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, కలెక్టర్ భవేశ్‌మిశ్రా దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీపీ పంతకాని సమ్మయ్య అన్నారు. మంగళవారం ఐటీఐ కళాశాలను ఎంపీపీ సందర్శించారు. సమస్యలను ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులను అడిగి తెలుసుకొన్నారు. కళాశాలలో కనీస వసతులు, మరుగుదొడ్లు, అదనపు తరగతి గదులు, బెంచీలు, ఫ్లోరింగ్ పూర్తిగా చెడిపోయి ఉన్నట్లు గమనించినట్లు ఎంపీపీ తెలిపారు. ఎమ్మెల్యే, కలెక్టర్‌ను నిధులు అడిగి సమస్యలను సత్వరమే పరిష్కారమయ్యేలా చూస్తామన్నారు. మండల పరిషత్ నుంచి రూ.5లక్షల నిధులు కేటాయించి మరమ్మతు పనులు చేయిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం సాంకేతిక విద్యాలయాలను విస్మరిస్తుందని ఆరోపించారు. కళాశాలలో ఇన్ని సమస్యలు నెలకొన్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయం అన్నారు. టైలరింగ్, డ్రెస్ మేకింగ్ కోర్సులు లేకపోవడంతో ఈ ప్రాంత విద్యార్థులు ఉపాధిని కోల్పోతున్నారని పేర్కొన్నారు. ఐటీఐ కళాశాలలో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే రూ.50 లక్షల నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ వెంట నాయకులు రమేశ్‌రెడ్డి, కొంరయ్య, గడవేణ దేవేందర్ ఉన్నారు.



సమస్యలను తెలుసుకొంటున్న ఎంపీపీ సమ్మయ్య

పోస్టర్ ఆవిష్కరణ

కాటారం: మండలంలోని చిద్నెపల్లికి చెందిన దేవునూరి వేణు బృందం సభ్యుల సారథ్యంలో తెరకెక్కుతున్న యాష్ ఓటర్ సినిమా పోస్టర్‌ను మంగళవారం మంథనిలో పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఎంతో శ్రమనోడ్చి సినిమా తీసిన వేణు, ఆయన బృందం సభ్యులను పుట్ట మధు, పుట్ట శైలజ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మారుమూల గ్రామానికి చెందిన వేణు ఒక ప్రత్యేక సందేశంతో కూడిన సినిమా తీయడం గర్వించదగిన విషయమన్నారు. నైపుణ్యంతో ముందుకు సాగే యువతకు తాము ఎల్లప్పుడు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. యువత ఎన్ని ఒడిదొడుకులు వచ్చిన తాము ఎంచుకొన్న రంగాల్లో ముందుకు సాగితే విజయం సాధిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర దర్శకుడు నాగరాజు నంగునూరి, దేవునూరి వేణు, అన్వర్‌పాషా, రంజిత్, రాకేశ్, హితేష్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కళాకారులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పుట్ట మధు, పుట్ట శైలజ

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు

కాటారం: ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని తహసీల్దార్ నాగరాజు హెచ్చరించారు. కాటారం మండలం గంగారం క్రాస్ రోడ్డు సమీపంలో ప్రభుత్వ భూమిలో అక్రమంగా కొనసాగుతున్న నిర్మాణాలపై పలువురు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ మంగళవారం విచారణ జరిపారు. కలెక్టర్ ఇళ్ల నిర్మాణాలు చేపట్టవద్దని ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఇళ్ల నిర్మాణాలు కొనసాగించడంతో యజమానులకు నోటీసులు ఇవ్వడంతో పాటు పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేయనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన పంచాయతీ కార్యదర్శులకు నోటీసులు జారీ చేయనున్నట్లు వివరించారు. తహసీల్దార్ వెంట సీనియర్ అసిస్టెంట్ భాస్కర్ ఉన్నారు.

పాఠశాలలో ఓనం పండుగ



నృత్యం చేస్తున్న ఉపాధ్యాయులు

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని మాంటిస్సోరి పాఠశాలలో ఓనమ్ పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేరళ రాష్ట్ర ప్రజలు ఘనంగా జరుకునే పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేసేందుకు పాఠశాలలో నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు ఉన్నితన్, అనిల్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కేరళ రాష్ట్ర నృత్యాలు, తిరువాతిరా, పులికలి అందరిని ఆకట్టుకున్నాయి. పాఠశాల చైర్మన్ నెందుతుండమ్, డైరెక్టర్లు సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసరావు ఉన్నారు.

చిన్నారులకు పలకలు, కుర్చీల పంపిణీ

కాటారం: స్వయం కృషి స్వచ్ఛంద సంస్థ సభ్యుడు కొట్టె సతీశ్ సుకన్య దంపతుల కుమార్తె శాన్వితృష్ట పుట్టిన రోజును పురస్కరించుకొని మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న చిన్నారులకు పలకలు, కూర్చీలు పంపిణీ చేశారు. నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న సుమారు 50 మంది చిన్నారులకు ఎస్సై అభినవ్ చేతుల మీదుగా వీటిని అందజేశారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ జవాన్ మనోహర్, వార్డు సభ్యుడు కొట్టె శ్రీహరి, స్వచ్ఛంద సంస్థ సభ్యులు సుమన్, రాజు, బాలరాజు, సందీప్, హైమద్, సాయి, వశీస్, అంజి, అఖి, ప్రవీణ్, దీపక్, నరేందర్, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.



కుర్చీలు, పలకలు అందజేస్తున్న ఎస్సై

కరెన్సీపై అంబేడ్కర్ బొమ్మ ముద్రించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పుల్ల మల్లయ్య

చిట్యాల: కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ బొమ్మను ముద్రించాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర నాయకుడు పుల్ల మల్లయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యంగాన్ని రచించిన గొప్ప మేధవి, నిమ్నా జాతి కులాల అభ్యున్నతి కోసం పోరాడిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ బొమ్మను కరెన్సీ నోట్లపై, నాణేలపై ముద్రించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏవైఎస్ జిల్లా కార్యదర్శి గుర్రపు రాజేందర్, నాయకులు గురుకుంట్ల కిరణ్, ఆరెపల్లి రాములు, కోయ్యడ దామెదర్ తదితరులు పాల్గొన్నారు.

‘108’లో ప్రసవం

చిట్యాల: 108 వాహనంలో ఓ తల్లీ పడ్డంటి పాపకు జన్మనిచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. టేకుమట్ల మండలంలోని పెద్దంపల్లికి చెందిన చిట్యాల రజిత రెండవ కాన్పు కోసం సోమవారం రాత్రి ఆమె భర్త సురేష్‌తో కలిసి చిట్యాల సివిల్ ఆస్పత్రికి వచ్చారు. రజితకు తీవ్ర నొప్పులు రావడంతో ఉమ్మనీరు తక్కువ ఉందని జిల్లా కేంద్రంలోని వంద పడకల ఆస్పత్రికి రేఫర్ చేశారు. ఈ మేరకు 108 వాహనంలో భూపాలపల్లికి తరలిస్తుండగా మార్గ మధ్యలో చిట్యాల మండలం జడలపేట గ్రామ శివారులో రజితకు తీవ్ర నొప్పులు కావడంతో అంబులెన్స్ సిబ్బంది మంచికట్ల సుధాకర్, పైలేట్ బత్తిని కుమార్ వాహనంలోనే నార్మల్ డెలవరీ చేయగా పడ్డంటి ఆడ బిడ్డకు జన్మనించింది. తల్లీ బిడ్డలను అదే వాహనంలో వంద పడకల ఆస్పత్రికి తరలించారు. ఆపదలో ఉన్నవారిని 108 సిబ్బంది ఆదుకోవడం మూలంగానే తల్లీ బిడ్డలు క్షేమంగా ఉన్నారని ఈ సందర్భంగా వారికి ఆమె కటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



మండల కమిటీ ఎన్నిక



మొగుళ్లపల్లి: మండలంలోని 25 గ్రామాల నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షకార్యదర్శులు మంగళవారం ములకలపల్లి మొగుళ్లపల్లి గ్రామాల మధ్య సమ్మక్క సారలమ్మ దేవతల సన్నిధిలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మొగుళ్లపల్లికి చెందిన నడిగోటి రామును రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా తూముల మహేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తూముల సురేష్, గౌరవ అధ్యక్షుడిగా తుముల నందం, ఉపాధ్యక్షులుగా తూముల రాజు, కురిమిండ్ల వెంకటేష్, కోశాధికారిగా మామిండ్ల నరసయ్య, సహాయ కార్యదర్శులుగా మేడిపల్లి వెంకట్రావ్, మురారి ప్రవీణ్, ఆర్గనైజర్‌గా సూత్రపు జీవన్ సాయి, గౌరవ సలహాదారులుగా ముత్యాల శ్రీనివాస్, మేడిపల్లి శ్రీనివాస్, మేడిపల్లి రమేష్, కార్యవర్గ సభ్యులుగా నడిగోటి తిరుపతి, చేన్న విక్రం, కురిమిండ్ల మొగిలి, సూత్రపు స్వామి, మేడిపల్లి కుమార్ స్వామి,ఆదిమూలం సత్యనారాయణ, మిడిదొడ్డి ఆనందం తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా కమిటీ అధ్యక్షుడు ముల్కనూరి భిక్షపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాదాస్ రాజశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు విజిగిరి హనుమయ్య, రాచకొండ తిరుపతి, కోశాధికారి సుధాకర్, ముఖ్య సలహాదారుడు రవి పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం..



భూపాలపల్లి రూరల్: సమాచార హక్కు చట్టం రక్షణ వేదిక మండల కన్వీనర్‌గా ముత్తాజ రమణాచారిని నియమించినట్లు రక్షణ వేదిక జిల్లా అధ్యక్షుడు చర్లపల్లి వెంకటేశ్వర్లు గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రమణాచారికి నియమాకపత్రం అందించారు. మండల కన్వీనర్‌గా నియమించినందుకు రమణాచారి జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరేష్, అ శోక్, ఓం ప్రకాశ్, నరేష్, సీహెచ్ ప్రభాకర్, సంతోష్, నరేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామశాఖ ఎమ్మార్పెస్ అధ్యక్షుడిగా రాజయ్యను జిల్లా ఇన్‌చార్జ్ బట్టు విజయ్, మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ ఆధ్వర్యంలో మంగళవారం ఏకగ్రీవంగా నియమించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్, రవితేజ, ధర్మయ్య ఉన్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీ..



టేకుమట్ల: మండలంలోని వెల్లంపల్లిలో కాంగ్రెస్ గ్రామ కమిటీని మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ వివరాలను వెల్లడించారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా పంజాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా శ్రీపతి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా కుర్రె మల్లేష్, కార్యదర్శులుగా మిట్టపెల్లి పోశాలు, పుల్లూరి రమేష్, ముఖ్య సలహాదారులుగా పుల్లూరి శంకర్, కార్యవర్గ సభ్యులుగా మిట్టపెల్లి రాజేశం, మిట్టపల్లి మహేందర్, కుర్రె సతీష్, బొజ్జపల్లి మల్లేష్, తాడవేని సంతోష్, అంబాల సమ్మయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పంజాల రవి, దేశిని మొగిళి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నిక



వంశీకృష్ణ



మధు

మల్హర్: జిల్లా కేంద్రంలో జరిగిన గౌడ సంఘాల సమావేశంలో మండలంలోని తాడిచర్ల గ్రామానికి చెందిన మాచర్ల వంశీకృష్ణ గౌడ సంఘం జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, మండల అధ్యక్షుడిగా మాచర్ల మధును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తమ ఎన్నికకు సహకరించిన నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మండల అధ్యక్షుడిగా రమేష్



భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి ముదిరాజ్‌ల సంఘం మండల అధ్యక్షుడిగా పంబాపూర్ గ్రామానికి చెందిన బంటు రమేష్‌ను ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రమేష్‌ను ముదిరాజ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు జోరుక సదయ్య ఆధ్వర్యంలో ముదిరాజ్‌లు ఘనంగా సన్మానించారు. తన ఎన్నికలకు సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు రమేష్ కృతజ్ఞతలు తెలిపారు.

బహుజన ఐక్య సంఘం..



మల్హర్: బహుజన ఐక్య సంఘం బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీల ఐక్య వేదిక మండల అధ్యక్షుడిగా మండలంలోని తాడిచర్ల గ్రామానికి చెందిన బండి రణధీర్ నియమించారు. ఈమేరకు మండలంలోని తాడిచర్లలో రాష్ట్ర అధ్యక్షుడు భూపెల్లి రాజు మంగళవారం రణధీర్‌కు నియామక ప్రతాన్ని అందించారు. ఈ సందర్భంగా రణధీర్ మాట్లాడుతూ.. బహుజన రాజ్యాధికారం దిశగా పోరాటం సాధిస్తానని పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

చిట్యాల: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలపై భూపాలపల్లి షీటీమ్ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి మారుతున్న టెక్నాలజీపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మన ఇంట్లో ఉన్న తల్లిదండ్రులకు ఎవరైనా సైబర్ మోసగాళ్ల ద్వారా ఫోన్ కాల్స్ వస్తే లిఫ్ట్ చేయవద్దని చెప్పాలని విద్యార్థులకు తెలిపారు. అలాగే లాటరీ ద్వారా డబ్బులు, బ్యాంక్ ద్వారా రుణాలు ఇస్తామని ఓటీపీ చేప్పండని మోసం చేస్తారని అలాంటివి నమ్మరాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రఘుపతి, ఉపాధ్యాయురాలు సరళదేవి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీలత